

పుస్తకావిష్కరణ

సీతంపేట: గాంధీ సెంటర్ అధ్యక్షుడు ఆచార్య వి.బాలమోహన్‌దాస్ రచించిన శోధన, పరిశోధన పుస్తకాన్ని ప్రొఫెసర్ కె.సి.రెడ్డి విశాఖలో ఆవిష్కరించారు.



అష్టదళ పద్మారాధన

డాబాగార్డెన్స్: కనకమహాలక్ష్మి అమ్మవారి ఆలయంలో జరిగిన లక్ష కుంకుమార్చన ప్రత్యేక పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు.



విశాఖలో నాకా బందీ

విశాఖ సిటీ: గంజాయి, ఇతర మత్తు పదార్థాల అక్రమ రవాణాను అరికట్టేందుకు నగరంలోని అన్ని ప్రాంతాల్లో పోలీసులు నాకా బందీ నిర్వహించారు.

న్యూస్‌రీల్

సతకంపట్టు కనకదుర్గమ్మ సన్నిధిలో సినీనటి ఇంద్రజ



సినీనటి ఇంద్రజకు కనకదుర్గమ్మవారి చిత్రపటాన్ని అందజేస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

అనకాపల్లి: స్థానిక గవరపాలెం సతకంపట్టు కనకదుర్గ అమ్మవారిని సినీ నటి ఇంద్రజ మంగళవారం కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. సినిమా షూటింగ్‌లో పాల్గొనేందుకు పట్టణానికి వచ్చిన ఆమె కనకదుర్గమ్మను దర్శించి పూజలు చేశారు. ఇంద్రజకు ఆలయ కమిటీ సభ్యులు అమ్మవారి చిత్రపటాన్ని బహూకరించారు. ఆలయ వ్యవస్థాపకుడు పి.వి.రమణ, ఆలయ శాశ్వత చైర్మన్, నిర్వాహకుడు కాండ్రేగుల నాయుడు దంపతులు, ఆలయ అధ్యక్షుడు భీమరశెట్టి వర నూకరాజు, గౌరీ పరమేశ్వరుల ఆలయ ఉత్సవ కమిటీ చైర్మన్ కొణతాల సంతోష్ అప్పారావునాయుడు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

కిరండూల్ రైళ్లు గమ్యం కుదింపు



తాటిచెట్లపాలెం: ఆధునికీకరణ పనుల నిమిత్తం కేకే లైన్‌లో నడిచే పలు రైళ్ల ఆయా తేదీల్లో గమ్యం కుదిస్తున్నట్లు వాల్తేర్ డివిజన్ సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ సందీప్ తెలిపారు.

- ఈ నెల 8వ తేదీ నుంచి 15వ తేదీ వరకు విశాఖపట్నం-కిరండూల్(58501) పాసింజర్ దంతేవాడ వరకు మాత్రమే నడుస్తుంది.
- ఈ నెల 9వ తేదీ నుంచి 16వ తేదీ వరకు కిరండూల్-విశాఖపట్నం(58502) పాసింజర్ దంతేవాడ నుంచి బయల్దేరుతుంది.
- ఈ నెల 8వ తేదీ నుంచి 15వ తేదీ వరకు విశాఖపట్నం-కిరండూల్(18515) నైట్ ఎక్స్‌ప్రెస్ దంతేవాడ వరకు మాత్రమే నడుస్తుంది.
- ఈ నెల 9వ తేదీ నుంచి 16వ తేదీ బయల్దేరే కిరండూల్-విశాఖపట్నం(18516) నైట్ ఎక్స్‌ప్రెస్ దంతేవాడ నుంచి బయల్దేరుతుంది.

మెరిసిన రావికమతం దివ్యాంగ విద్యార్థి



జాతీయ స్థాయి క్రీడా నిపుణుడు రాజశేఖర్ నుంచి పతకం స్వీకరిస్తున్న గణేష్

రావికమతం: విజయవాడలోని హీల్ ప్యారడైజ్ స్కూల్లో ఇటీవల జరిగిన రాష్ట్ర స్థాయి స్పెషల్ ఒలింపిక్ భారత్-2025 క్రీడా పోటీల్లో రావికమతం మండలం కొమిర గ్రామానికి చెందిన మానసిక దివ్యాంగ విద్యార్థి అప్పికొండ గణేష్ సత్తా చాటాడు. వాలీబాల్ పోటీల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. రాష్ట్ర సమగ్ర శిక్ష సహిత విద్యా కన్సల్టెంట్ డాక్టర్ వై.నరసింహం, హీల్ ప్యారడైజ్ స్కూల్ డైరెక్టర్ అజయ్, స్పెషల్ ఒలింపిక్ భారత కమిటీ జాతీయ స్థాయి క్రీడా నిపుణుడు రాజశేఖర్ చేతుల మీదుగా గణేష్ ప్రశంసాపత్రం, బంగారు పతకం అందుకున్నాడు. గుజరాత్ రాష్ట్రం అహ్మదాబాద్‌లో జూన్‌లో జరిగే జాతీయ స్థాయి దివ్యాంగుల యూనిఫైడ్ వాలీబాల్ స్పెషల్ ఒలింపిక్ భారత క్రీడా పోటీల్లో గణేష్ తలపడనున్నాడు. విద్యార్థులకు శిక్షణ ఇచ్చిన మేడివాడ హైస్కూల్ ప్రత్యేక ఉపాధ్యాయులు మహాలక్ష్మీనాయుడు, జగన్నాథనాయుడును జిల్లా విద్యాశాఖ అధికారులు, సమగ్ర శిక్ష ప్రాజెక్ట్ ఉన్నతాధికారులు, మండల విద్యా శాఖ అధికారులు, విద్యార్థుల తల్లిదండ్రులు అభినందించారు.

10 నుంచి విశాఖ-బ్రహ్మపూర్ పాసింజర్ రద్దు


తాటిచెట్లపాలెం: ఆధునికీకరణ పనుల కారణంగా ఈ నెల 10 నుంచి 14వ తేదీ వరకు విశాఖపట్నం-బ్రహ్మపూర్ (58532), బ్రహ్మపూర్-విశాఖపట్నం (58531) పాసింజర్‌ను రద్దు చేస్తున్నట్లు వాల్తేర్ డివిజన్ సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ కె.సందీప్ ఓ ప్రకటనలో తెలిపారు. వేసవి దృష్ట్యా చర్లపల్లి-నహర్‌లగున్-చర్లపల్లి స్పెషల్ రైలును మరికొంత కాలం పొడిగించినట్లు పేర్కొన్నారు. చర్లపల్లి-నహర్‌లగున్ (07046) స్పెషల్ ఈ నెల 10, 17, 24, 31 తేదీల్లో(ఆదివారం) చర్లపల్లిలో ఉదయం 8.40 గంటలకు బయలుదేరి అదే రోజు రాత్రి 9.13 గంటలకు దువ్వాడ చేరుకుంటుంది.

• అడుగడుగునా రాజకీయం.. దుర్భర 'జల జీవనం'

దాహమో రామచంద్రా..

జిల్లాలో జల్ జీవన్ మిషన్ అమలుకు కూటమి నేతల గ్రహణం

- కుళాయి కనెక్షన్ల ఏర్పాటులో రాజకీయ వివక్ష
- ప్రభుత్వం మారాక పలుచోట్ల పడకేసిన పైపులైన్ పనులు
- కొన్నిచోట్ల పనులు పూర్తయినా డబ్బులిస్తేనే ఇంటికి కనెక్షన్లు



జిల్లాలో గ్రామీణ కుటుంబాల సంఖ్య **4,17,489**

2024 మార్చి నెలాఖరుకు ఇచ్చిన ఇంటి కనెక్షన్లు **2,64,109**

ఈ ఏడాదిలో పూర్తి చేయాల్సిన కనెక్షన్లు **1,53,380**

పూర్తయినవి-రద్దు చేసినవి

మంజూరు: రూ.**673.06** కోట్ల అంచనా విలువతో **1806** పనులు

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో పూర్తయినవి: **259.97** కోట్లతో **986** పనులు

కూటమి ప్రభుత్వం రద్దు చేసినవి: **448** పనులు



ఎస్.రాయవరం మండలం సర్వసిద్ధిలో ప్రారంభానికి నోచని వాటర్ ట్యాంక్



నక్కపల్లి మండలం పెద్ద దొడ్డిగల్లులో నిర్మించిన నీటి పథకం

సాక్షి, అనకాపల్లి: గ్రామీణ ప్రాంతాల్లో ఇంటింటికీ నీటి కుళాయిల ఏర్పాటే లక్ష్యంగా అమలు చేస్తున్న జల్ జీవన్ మిషన్ ప్రాజెక్టుకు గ్రహణం పట్టింది. కూటమి నేతలు తాగునీటిని కూడా రాజకీయం చేస్తున్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో మంజూరు చేసిన పనులను రద్దు చేసి, కూటమి ఎమ్మెల్యేలు సిఫారసు చేసిన వాటికే మళ్లీ కొత్త అనుమతులు ఇస్తున్న పరిస్థితులు జిల్లాలో నెలకొన్నాయి. ఇలా సుమారు 448 పనులను రద్దు చేశారు. కుళాయి కనెక్షన్ పూర్తయినా, సగం పనులు జరిగి ఆగిపోయినా అలాంటి వాటికి మామూళ్లు ఇస్తేనే కొనసాగిస్తున్నట్లు పలువురు బాధితులు వాపోతున్నారు. జల్ జీవన్ మిషన్ అమలుపై 'సాక్షి' జరిపిన గ్రౌండ్ రిపోర్ట్‌లో అనేక విషయాలు వెలుగు చూశాయి.

పాత పనులకు మంగళం

గత ప్రభుత్వ హయాంలో మంజూరై ప్రారంభం కాని కనెక్షన్లలో దాదాపు సగానికి పైగా రద్దు చేశారు. కొత్తగా కొన్నింటిని చేర్చారు. వాటికి నిధులు ఇంకా మంజూరు కాలేదు. జల్ జీవన్ మిషన్ ద్వారా గ్రామీణ ప్రాంతంలో ప్రతీ ఇంటికీ కుళాయి ఇవ్వాలనేదే ఈ ప్రాజెక్టు లక్ష్యం. కానీ కూటమి ప్రభుత్వం పరిస్థితి చూస్తే ఆ ఆశయం నెరవేరేలా లేదు. ఈ వేసవిలో కశింకోట, అచ్యుతాపురం, రాంబిల్లి, పరవాడ, యలమంచిలి, నక్కపల్లి మండలం వంటి పారిశ్రామిక ప్రాంతాల్లో ప్రజలు చాలా ఇబ్బందులు పడుతున్నారు.



కశింకోటలోని వడ్డీ వీధి జగనన్న మెగా లేఔట్‌లో ఏర్పాటు చేసిన కుళాయి.. ఏడాదికాలంగా నీటి సరఫరా జరగక అలంకారప్రాయంగా మిగిలింది

ఊరూరా దాహం.. దాహం..

- మాడుగుల, దేవరాపల్లి, చీడికాడ, కె.కోటపాడు మండలాల్లో 316 గ్రామాల్లో జల్‌జీవన్ మిషన్‌లో రూ.171 కోట్లతో 68,385 కనెక్షన్లు మంజూరయ్యాయి. వీటిలో 44,464 పూర్తయ్యాయి. ఆనందపురం నుంచి కె.కోటపాడు వెళ్లే మార్గంలో ఉన్న ఇళ్లకు మాత్రం నేటికి కుళాయిల ఏర్పాటు లేదు. అసలే వేసవికాలం కావడంతో చేతిబోర్ల వెంట నీరు అంతంత మాత్రంగానే వస్తుందని ఆయా ప్రాంతాల్లో గల మహిళలు తెలిపారు.
- అనకాపల్లి రూరల్ పరిధిలో 3 వేల కనెక్షన్లు మంజూరయ్యాయి. వీటిలో సగానికిపైగా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో పూర్తయ్యాయి. కొత్త ప్రభుత్వం వచ్చాక కొన్ని పనులను రద్దు చేశారు. కొత్తగా మరికొన్ని మంజూరు చేసినా బిల్లు ఇప్పటి వరకూ రాలేదు.
- నర్సీపట్నం రూరల్, నాతవరం, గొలుగొండ, మాకవరపాలెం మండల పరిధిలో తాగునీటి సరఫరా అంతంత మాత్రంగా ఉంది. జల్‌జీవన్ మిషన్‌లో భాగంగా సుమారు 40 వేలకు పైగా ఇంటింటికీ కుళాయి కనెక్షన్లు మంజూరయ్యాయి. వీటిలో 60 శాతానికి పైగా పూర్తయ్యాయి. కొన్ని పెండింగ్‌లో ఉన్నాయి. మరికొన్ని అసలు ప్రారంభం కాలేదు.
- యలమంచిలి నియోజకవర్గంలో సుమారు 20 వేలకు పైగా కుళాయి కనెక్షన్లు మంజూరయ్యాయి. అచ్యుతాపురం, రాంబిల్లి మండలాలు పూర్తిగా పారిశ్రామిక ప్రాంతం కావడంతో 10 వేలకుపైగా కుళాయిలు మంజూరయ్యాయి. గత ప్రభుత్వ హయాంలో సగానికిపైగా పూర్తయ్యాయి. కానీ పారిశ్రామిక ప్రాంతంలో గత ప్రభుత్వంలో మంజూరైన పనుల్లో కొన్ని రద్దు చేసి మరికొన్ని కొత్తగా చేర్చారు.వీటికి నిధులు మంజూరు కాలేదు. ఈ ప్రాంతమంతా కలుషితం కావడంతో ఈ ప్రాంతంలో వాటర్ సమస్య ఎక్కువగా ఉంది. స్థానికంగా ఈ రెండు మండలాల్లో తాగునీటి సమస్య ఎక్కువగా వెంటాడుతుంది.
- చోడవరం నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం హయాంలో రూ.137 కోట్లతో 69 వేల ఇళ్లకు ఇంటింటికీ కుళాయిలు మంజూరు చేశారు. వీటిలో సుమారు 10 వేల కనెక్షన్లు పెండింగ్‌లో ఉండిపోయాయి. చోడవరం టౌన్‌లో 5,941 ఇంటింటి కుళాయిలు ఇచ్చారు. కందర్పకాలనీ, అన్నవరం ప్రాంతాల్లో ఇంకా 400 ఇళ్లకు ఇంటింటి కుళాయిలు ఇవ్వాల్సి ఉండగా కూటమి ప్రభుత్వం వచ్చాక ఇప్పటి వరకూ వాటిని ఏర్పాటు చేయలేదు. దీనితో ఆయా ప్రాంతాల్లో మంచినీటి సమస్య ఉంది. ఏదో అడపాదడపా వీధి కుళాయిల ద్వారా నీరు ఇస్తున్నప్పటికీ ఒక్కొక్క ఇంటికి రెండు బిందెలు నీరు కూడా రావడం లేదు.

దర్యాప్తులో ఫోరెన్సిక్ ఆధారాలు కీలకం



శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న విశాఖ రేంజ్ డీఐజీ గోపీనాథ్ జెట్టి



శిక్షణలో పాల్గొన్న పోలీసు అధికారులు, వైద్యులు, న్యాయవాదులు

అనకాపల్లి: నేరాల దర్యాప్తులో ఆధునిక శాస్త్రీయ విధానాల ప్రాముఖ్యతను దృష్టిలో ఉంచుకుని, కేసులను త్వరితగతిన పూర్తి చేయాలని విశాఖ రేంజ్ డీఐజీ గోపీనాథ్ జెట్టి అన్నారు. స్థానిక గాంధీనగరం ఎస్‌ఆర్ శంకరన్ హాల్లో మంగళవారం పోలీసు, వైద్యులు, న్యాయవాదులతో నేరచరిత్రపై ఒక రోజు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ నేరస్థలాల్లో ఫోరెన్సిక్ ఆధారాల సేకరణ, నిర్వహణ, 'చైన్ ఆఫ్ కస్టడీ' పాటించాల్సిన విధానాలపై అధికారులు అవగాహన కలిగి ఉండాలన్నారు. బాధితులకు న్యాయం జరగాలంటే దర్యాప్తు అధికారులు, ఫోరెన్సిక్, వైద్యులు, పబ్లిక్ ప్రాసిక్యూటర్లు పరస్పర సహకారంతో పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు. ఫోరెన్సిక్ ఎవిడెన్స్ మేనేజిమెంట్ శిక్షణ ద్వారా నిందితులకు తగిన శిక్షలు పడేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఎస్పీ తుహిన్ సిన్హా మాట్లాడుతూ వర్క్‌షాప్‌లో నార్కోటిక్స్, మత్తు పదార్థాలు, విషపదార్థాలు (టాక్సికాలజీ), డిజిటల్ ఆధారాలు, సైబర్ నేరాల పరికరాలు, ఆడియో-వీడియో ఫుటేజ్, డీఎన్ఏ, రక్త నమూనాలు, మానవ అవయవాలు వంటి ఆధారాల సేకరణ, ప్యాకింగ్, భద్రపరచే విధానంపై దృష్టి సారించి, సంబంధిత ఆధారాలతో సకాలంలో కోర్టుకు ఇవ్వడం వల్ల నిందితులకు శిక్ష పడుతుందన్నారు. అంతకుముందు ఒక రోజు శిక్షణ కార్యక్రమాన్ని ఆర్.ఎఫ్.ఎస్.ఎల్ అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ వి.నాగరాజు, శాస్త్రీయ సహాయకులు ఎం.రాంబాబు, పి.వి.ఎస్.బి.చలపతి, ఇ.కిరణ్ కుమార్ నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా అదనపు ఎస్పీలు ఎం.దేవప్రసాద్, ఎల్.మోహనరావు, డీఎస్పీలు ఎం.శ్రావణి, పి.శ్రీనివాసరావు, వి.విష్ణు స్వరూప్, ఫోరెన్సిక్ వైద్యులు, పబ్లిక్ ప్రాసిక్యూటర్లు, సీఐలు లక్ష్మణ్ మూర్తి, బాల సూర్యారావు, లక్ష్మి, విజయ, ఎస్ఐలు ప్రసాద్, రమణయ్య, సురేష్ బాబు పాల్గొన్నారు.

ఎకరా స్థలం లీజు ఏడాదికి వెయ్యి రూపాయలేనట

- టీడీపీ కార్యాలయం పట్ల కలెక్టర్ ఔదార్యం
- నిబంధనలకు విరుద్ధంగా భూమి కేటాయింపుపై సీపీఎం ధ్వజం



కొత్తూరులో టీడీపీకి కేటాయించిన స్థలాన్ని పరిశీలిస్తున్న సీపీఎం నేతలు

అనకాపల్లి టౌన్: పేదల స్థలాలను కాపాడాల్సిన జిల్లా కలెక్టరే రాజకీయ పార్టీలకు వత్తాసు పలకడం ఏమిటని సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు కె.లోకనాథం ప్రశ్నించారు. కొత్తూరు పంచాయతీ పరిధిలో ఉన్న స్థలాన్ని మంగళవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదల ప్రయోజనాలకు, సంక్షేమానికి కృషి చేయాల్సిన జిల్లా అధికారి టీడీపీకి స్వామి భక్తి చాటుకోవడం సిగ్గు చేటని అన్నారు. జిల్లా కేంద్రంలో టీడీపీ కార్యాలయానికి విలువైన కోట్ల ప్రభుత్వ స్థలాన్ని ఎకరా ఏడాదికి వెయ్యి రూపాయలకే లీజుకు ఇవ్వడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి గంటా శ్రీరామ్, జిల్లా కమిటీ సభ్యుడు శ్రీనివాసరావు పాల్గొన్నారు.

కోర్టుకు స్థలం లేదు కానీ అధికార పార్టీకి కేటాయింపా?

జిల్లా కేంద్రంలో ఏళ్ల తరబడి వివిధ న్యాయస్థానాలు ఓ ప్రైవేట్ భవనంలో నడుస్తున్నా, పట్టించుకోని కూటమి పాలకులు తెలుగుదేశం పార్టీకి మాత్రం రెండెకరాల భూమి కేటాయించుకోవడం తగదని ఆల్ ఇండియా లాయర్స్ అసోసియేషన్ ఫర్ జస్టిస్ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పి.ఎస్.అజయ్‌కుమార్ ఒక ప్రకటనలో విమర్శించారు.

అనకాపల్లి జిల్లా కేంద్రంగా మారిన తర్వాత కళాశాల కోసం కట్టిన ప్రైవేట్ భవనాన్ని న్యాయస్థానాలకు అద్దెకు ఇచ్చారని, ఆ ఇరుకు గదుల్లోనే కోర్టులను నిర్వహిస్తున్నారన్నారు. స్థలం కేటాయించాలని జిల్లా కలెక్టర్‌కు అనేక సార్లు లేఖలు రాసి, వినతిపత్రాలను ఇచ్చామని, స్థలాలు దొరకడం లేదని చెపుతూ వచ్చిన అధికారులు తెలుగుదేశం పార్టీ అడిగిన వెంటనే మంత్రివర్గంతో సంబంధం లేకుండా రూ. రెండు కోట్ల నుంచి మూడు కోట్ల విలువైన రెండు ఎకరాల స్థలాన్ని ఏడాదికి కేవలం వెయ్యి రూపాయల అద్దెతో 33 సంవత్సరాలకు భూమిని అప్పగించారన్నారు.

కుట్టు శిక్షణ పేరుతో కుంభకోణం

- బీసీ మహిళల సంక్షేమానికంటూ రూ.257 కోట్లు స్వాహా చేసేందుకు కుట్ర
- కుట్టు మిషన్ విలువ మూడింతలు పెంచిన కూటమి నేతలు
- వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు లోచల సుజాత



డీఆర్వో సత్యనారాయణరావుకు వినతిపత్రం అందజేస్తున్న వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు లోచల సుజాత

అనకాపల్లి: బీసీ మహిళలకు టైలరింగ్ శిక్షణ పేరిట కూటమి ప్రభుత్వం రూ.257 కోట్ల అవినీతికి పాల్పడిందని వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు లోచల సుజాత విమర్శించారు. రూ.7,300లు విలువైన కుట్టు మిషన్‌కు రూ.23 వేలు ఖర్చు చూపించడం దారుణమని ఆమె అన్నారు. ఈ దోపిడీని ఆపాలని కలెక్టర్ కార్యాలయంలో డీఆర్వో వై.సత్యనారాయణరావుకు మంగళవారం వినతిపత్రం అందజేశారు. అనంతరం రింగ్‌రోడ్డులోని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త మలసాల భరత్‌కుమార్ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. లక్షమంది బీసీ మహిళలకు రూ.73 కోట్లు ఖర్చవుతుంటే, చంద్రబాబునాయుడు ప్రభుత్వం రూ.257 కోట్లు చూపించడం ఏమిటని ఆమె ప్రశ్నించారు. మిగిలిన సొమ్మును పక్కదారి పట్టించారన్నారు. నాటి ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి మహిళలకు అనేక సంక్షేమ పథకాలను నేరుగా వారి బ్యాంక్ ఖాతాల్లో జమ చేసి, అవకతవకలకు ఆస్కారం లేకుండా పాలన సాగిస్తే, నేటి కూటమి పాలనలో అవినీతి పెరిగిపోయిందన్నారు. పెద్ద కంపెనీలకు టెండర్ ఇవ్వకుండా కూటమి ప్రభుత్వం ఎల్2, ఎల్3 కంపెనీలకు టెండర్ కట్టబెట్టి కోట్లాది రూపాయలు దోచుకుంటోందన్నారు. దీనిపై పూర్తిస్థాయిలో దర్యాప్తు చేసి, మహిళలకు న్యాయం చేయాలని ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా మహిళా విభాగం నాయకులు నీటిపల్లి లక్ష్మి, నదియా, మరిపల్లి శోభ, ఎస్ఎస్.లక్ష్మి, ఎం. విజయలక్ష్మి, కశింకోట మండలపార్టీ మహిళా విభాగం అధ్యక్షురాలు తగరంపూడి నూకరత్నం తదితరులు పాల్గొన్నారు.

కోట్లాది రూపాయల అవినీతికి భారీ స్కెచ్



దేవరాపల్లి: రాష్ట్రంలో బీసీ మహిళలకు టైలరింగ్ శిక్షణ పేరిట భారీ దోపిడీకి కూటమి ప్రభుత్వం పక్కా స్కెచ్ వేసిందని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర మహిళా విభాగం ప్రధాన కార్యదర్శి ఈర్లె అనురాధ విమర్శించారు. తారువలో మంగళవారం ఆమె స్థానిక విలేకర్లతో మాట్లాడారు. బీసీ మహిళలకు ఇచ్చే కుట్టు శిక్షణలో కోట్లాది రూపాయలను కొల్లగొట్టేందుకు ఈ స్కీమ్‌ను వాడుకుంటున్నారని ఆమె ధ్వజమెత్తారు. కుట్టు శిక్షణ పేరిట రూ.257 కోట్లకు టెండర్ పెట్టే విధంగా అనుకూలంగా పథకాన్ని మలుచుకుంటున్నారని ఆరోపించారు. నిబంధనలకు విరుద్ధంగా కాంట్రాక్టర్లకు ముందస్తు చెల్లింపులకు సిద్ధం కావడం ఇందుకు నిదర్శనమన్నారు.

ఘనంగా శ్రీవైష్ణవ శ్రీరామనవమి



అభిషేకం నిర్వహిస్తున్న అర్చకుడు

సింహాచలం: మేష శుద్ధ నవమిని పురస్కరించుకుని శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి ఆలయంలో మంగళవారం శ్రీవైష్ణవ శ్రీరామనవమి(చక్రవర్తి తిరుమగనార్ తిరునక్షత్రం) ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను ఆలయ ఆస్థానమండపంలో అధిష్టించి అభిషేకాలు నిర్వహించారు. తదుపరి ఉత్సవమూర్తులకు విశేషాలంకారం చేసి దివ్య ప్రబంధ పారాయణాన్ని పఠించారు.

ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలకు పక్కా ఏర్పాట్లు

తుమ్మపాల: జిల్లాలో ఇంటర్మీడియెట్ సప్లిమెంటరీ పరీక్షల నిర్వహణకు పక్కా ఏర్పాట్లు చేయాలని జిల్లా రెవెన్యూ అధికారి సత్యనారాయణరావు సంబంధిత అధికారులను ఆదేశించారు. పరీక్షల నిర్వహణకు ముందస్తు ఏర్పాట్లలో భాగంగా సంబంధిత శాఖల అధికారులతో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అధికారులంతా సమన్వయంతో పని చేసి, ఎక్కడా ఎటువంటి సమస్యలు తలెత్తకుండా ఏర్పాట్లు చేయాలన్నారు. పరీక్ష కేంద్రాల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలన్నారు. విద్యార్థులు సకాలంలో కేంద్రాలకు చేరుకునేలా బస్సులను అందుబాటులో ఉంచాలని ఆర్టీసీ అధికారులకు సూచించారు. పరీక్షలు జరుగుతున్న సమయంలో విద్యుత్ సరఫరాకు అంతరాయం లేకుండా చూడా లని ఏపీఈపీడీసీఎల్ అధికారులను ఆదేశించారు. తా గునీరు, మందులు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబా టులో ఉంచాలని జీవీఎంసీ, పంచాయతీ అధికారు లకు సూచించారు. కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేయాలని, కేంద్రాలకు దగ్గరలోని జెరాక్స్ సెంటర్లను మూసివేయాలన్నారు. పరీక్ష పత్రాల తరలింపు సమయంలో, తనిఖీ బృందాలకు ఎస్కార్ట్, పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయాలని పోలీసు అధికారులకు సూచించారు. జవాబు పత్రాల బండిల్స్‌ను సకాలంలో తరలింపునకు పరీక్షల నిర్వహణ అధికారులకు తపాలా శాఖ సిబ్బంది సహకరించాలన్నారు.

ఈ నెల 12 నుంచి పరీక్షలు

జిల్లా ఇంటర్మీడియెట్ ఎడ్యుకేషన్ అధికారి బి.సుజాత మాట్లాడుతూ ఈ నెల 12 నుంచి 19 వరకు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు మొదటి సంవత్సరం పరీక్షలు, మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు రెండో సంవత్సరం పరీక్షలు జరుగుతాయని తెలిపారు. జిల్లాలో మొదటి సంవత్సరం 9,323 మంది, రెండో సంవత్సరం 4,414 మంది వెరసి మొత్తం 13,737 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారన్నారు. జిల్లాలో 27 సెంటర్లు ఏర్పాటు చేశామని, విద్యార్థులు కేంద్రానికి ఒక గంట ముందుగా చేరుకోవాలని సూచించారు. తనిఖీ చేయడానికి 2 ఫ్లయింగ్, 2 సిట్టింగ్ స్క్వాడ్‌లను ఏర్పాటు చేశామన్నారు. జిల్లా వైద్యారోగ్య శాఖాధికారి శాంతిప్రభ, ఆర్టీసీ అసిస్టెంట్ డిపో మేనేజర్ రవిచంద్ర, ఏపీఈపీడీసీఎల్, ట్రెజరీ, జీవీఎంసీ, పంచాయతీ, పోస్టల్ శాఖల అధికారులు పాల్గొన్నారు.

నక్కపల్లిలో ఆస్ట్రోటర్ఫ్ హాకీ కోర్టు

- వైఎస్సార్‌సీపీ హయాంలోనే రూ.1.60 కోట్లతో నిర్మాణం
- ప్రారంభించిన హోంమంత్రి అనిత
- నక్కపల్లికి అంతర్జాతీయ గుర్తింపునకు కృషి





ఆస్ట్రోటర్ఫ్ కోర్టులో విద్యార్థులతో ప్రాక్టీస్ చేయిస్తున్న మంత్రి అనిత

నక్కపల్లి: బీఎస్ హాకీ క్లబ్‌కు అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు తీసుకొచ్చేందుకు తన వంతు కృషి చేస్తానని హోం మంత్రి వంగలపూడి అనిత తెలిపారు. గత వైఎస్సార్‌సీపీ హయాంలో మంజూరైన రూ.1.60 కోట్లతో నక్కపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణలో నిర్మించిన ఆస్ట్రోటర్ఫ్ మినీ హాకీ కోర్టును మంగళవారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇటువంటి కోర్టు మన జిల్లాలో నిర్మించడం ఆనందంగా ఉందన్నారు. పోలీస్ శాఖలో పనిచేస్తున్న సూరిబాబు అనే ఉద్యోగి నక్కపల్లిలో హాకీ క్లబ్‌ను ఏర్పాటు చేసి వందలాది మందికి శిక్షణ ఇచ్చి రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీలకు తర్ఫీదు నివ్వడం, ఈ ప్రాంతానికి జాతీయ స్థాయిలో గుర్తింపు తీసుకురావడం గర్వంగా ఉందన్నారు. ఇక్కడ శిక్షణ పొందిన పలువురు విద్యార్థులు ఉద్యోగాల్లోను, స్పోర్ట్స్ స్కూళ్లలోనూ ప్రవేశాలు పొందారన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీలు వీసం నానాజీ, వెలగా ఈశ్వరరావు, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ తోట నగేష్, సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ డైరెక్టర్ బోడపాటి శివదత్, కోచ్ రాంబాబు, ఏరియా ఆస్పత్రికి అభివృద్ధి కమిటీ సభ్యుడు కే వెంకటేష్, సర్పంచ్ రత్నకుమారి, బీఎస్ హాకీ క్లబ్ అధ్యక్ష కార్యదర్శులు సూరిబాబు, తాతాజీ, నాయకులు పాల్గొన్నారు.

సార్వత్రిక ఎన్నికలతో ఆగిన ప్రారంభోత్సవం..

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఇక్కడ హాకీ క్రీడా మైదానాన్ని సందర్శించిన అప్పటి కలెక్టర్ రవి పట్టన్‌శెట్టికి క్రీడాకారులు తమ సమస్యలను విన్నవించారు. ప్రాక్టీసు కోసం పడుతున్న ఇబ్బందులను వివరించారు. ఆధునిక సదుపాయాలతో కూడిన కోర్టు నిర్మించాలని కోరారు. ఎమ్మెల్యే గొల్ల బాబూరావు సైతం ఇదే విషయాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లగా, స్పోర్ట్స్ సెస్ నిధులు నుంచి ఆస్ట్రోటర్ఫ్ కోర్టుకు రూ.1.60 కోట్లు మంజూరు చేశారు. కోర్టు నిర్మాణానికి అప్పటి ఎమ్మెల్యే, ప్రస్తుత రాజ్యసభ సభ్యుడు గొల్ల బాబూరావు శంకుస్థాపన చేశారు. కోర్టు నిర్మాణం పూర్తయింది. విద్యుత్ సరఫరా లేకపోవడంతో దీన్ని ప్రారంభించలేదు. ఇంతలో ఎన్నికల రావడం, కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత స్థానిక నాయకులు, హాకీ క్లబ్ నిర్వాహకులు కోర్టుకు విద్యుత్ సరఫరా విషయాన్ని హోం మంత్రి అనిత దృష్టికి తీసుకెళ్లారు. ఆమె కలెక్టర్‌తో మాట్లాడి సీఎస్ఆర్ నిధుల నుంచి రూ.4.50 లక్షలు విద్యుత్ సరఫరా కోసం మంజూరు చేయించారు. దీంతో కోర్టు సమీపంలో ప్రత్యేకంగా ట్రాన్స్‌ఫార్మర్, హెచ్‌టీ విద్యుత్ లైన్లు ఏర్పాటు చేసి విద్యుత్ సదుపాయం కల్పించారు. తాజాగా ఆమె దీన్ని ప్రారంభించారు.

రాష్ట్రంలో నాలుగో ఆస్ట్రోటర్ఫ్ కోర్టు నక్కపల్లిలోనే..

ఇటువంటి ఆస్ట్రోటర్ఫ్ కోర్టులు రాష్ట్రంలో నాలుగు చోట్ల మాత్రమే నిర్మించారు. ఇప్పటి వరకు కడప, పులివెందుల, కాకినాడలలో ఉన్నాయి. తాజాగా నక్కపల్లిలో నిర్మించారు. ఇటువంటి కోర్టులు అనుభవం ఉన్న ఫీల్డ్ హాకీ క్రీడాకారులకు మరిన్ని మెలకువలు నేర్పించడం కోసం ఉపయోగిస్తారు.

కోర్టు నిర్మాణం ఇలా..

ఈ కోర్టును నాలుగు రకాల ముడిసరుకును ఉపయోగించి నిర్మిస్తారు. మొదటగా గ్రావెల్ వేసి ఆపైన మెటల్ గ్రౌండ్ వేస్తారు. చదునుగా చేసిన తర్వాత ఖరీదైన మొత్తటి రబ్బర్ పౌడర్ మిశ్రమంతో కలిపి తారురోడ్డు మాదిరిగా గ్రౌండ్ తయారు చేస్తారు. తుది దశకు చేరకున్న తర్వాత కృత్రిమ గడ్డితో తయారు చేయబడిన టర్ఫ్ అనే షీటును పరిచి పై పొర మీద సన్నటి ప్లాస్టిక్ వైరు ఒక పొరగా అమర్చి దీనిపై ఒక అంగుళం రబ్బరు షీటుతో పైభాగాన్నా క్రీడాకారులు ఆడేందుకు అనువుగా ఉండేలా తయారు చేస్తారు. ఇటువంటి కోర్టు ఉమ్మడి విశాఖ జిల్లాలో నక్కపల్లిలో మాత్రమే ఉంది. ఈ టర్ఫ్ కోర్టు కింద భాగంలో వాటర్‌ను స్ప్రే చేసేందుకు 5 హెచ్‌పీ మోటార్లను అమర్చారు. వాటర్ స్ప్రే చేస్తూ ప్రాక్టీస్ చేయాల్సి ఉంటుంది. ఈ కోర్టులో త్వరగా ఆడటానికి అనుకూలంగా ఉంటుంది. ఫీల్డర్స్ వేగంగా పరిగెత్తడానికి, బంతిని నియంత్రించడానికి ఎంతగానో ఉపయోగపడుతుంది. ఆటగాళ్లను నియంత్రించడానికి కూడా ఎక్కువ సహకరిస్తుంది. ఇటువంటి ఆస్ట్రోటర్ఫ్ కోర్టుల్లో ప్రాక్టీస్ చేయడం వల్ల హాకీలో క్రీడాకారులు బాగా రాణిస్తారని బీఎస్ హాకీ క్లబ్ అధ్యక్షుడు బలిరెడ్డి సూరిబాబు తెలిపారు.


డ్రంకన్ డ్రైవ్ కేసుల్లో జరిమానా, జైలు శిక్ష

యలమంచిలి రూరల్: డ్రంకన్ డ్రైవ్ కేసులో న్యాయమూర్తి 32 మందికి రూ.10 వేలు చొప్పున మొత్తం రూ.3.20 లక్షలు జరిమానా, ఐదుగురు నిందితులకు నాలుగు రోజుల చొప్పున జైలుశిక్ష విధించినట్టు ట్రాఫిక్ ఎస్సై బి. రామకృష్ణ తెలిపారు. స్థానిక ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఇటీవల నమోదైన 37 డ్రంకన్ డ్రైవ్ కేసుల్లో నిందితులను మంగళవారం యలమంచిలి ఏజేఎఫ్‌సీఎం కోర్టులో హాజరుపర్చగా పై విధంగా తీర్పునిచ్చారన్నారు. మద్యం తాగి వాహనాలు నడపవద్దని వాహన చోదకులకు సూచించారు. నిబంధనలు పాటించని వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు.

సింహాచలంలో సమన్వయలోపం?

ఆర్జిత సేవల రద్దుపై భక్తురాలి ఆగ్రహం

సింహాచలం: వరాహ లక్ష్మీనృసింహస్వామి ఆలయంలో మంగళవారం ఆర్జిత సేవలను రద్దు చేయడంపై ఓ భక్తురాలు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ఆలయంలో శ్రీవైష్ణవ శ్రీరామనవమి వేడుకలను నిర్వహించినందున ఆలయ వర్గాలు మంగళవారం ఆర్జిత సేవలను నిలిపివేశాయి. ఈ విషయాన్ని భక్తులకు ముందుగా తెలియజేయడంలో ఆలయ యంత్రాంగం విఫలమైంది. సోమవారం సాయంత్రం సింహగిరిపై ఉన్న పీఆర్వో కార్యాలయానికి ఓ భక్తురాలు ఫోన్ చేసి గరుడ సేవపై వాకబు చేశారు. సిబ్బంది సేవలు ఉంటాయని సమాధానమిచ్చారు. దీంతో



ఉదయం దూర ప్రాంతం నుంచి సింహగిరికి చేరుకున్న ఆమె ఆర్జిత సేవలు గురించి ఆరా తీయగా, ఈ రోజు జరగడం లేదని సిబ్బంది తెలిపారు. దీంతో వాగ్వాదానికి దిగారు. చివరకు చేసేదేమీ లేక నిరాశతో వెనుదిరిగారు. ఆలయ వర్గాలకు, పీఆర్వో కార్యాలయానికి మధ్య సమన్వయం లేకపోవడం వల్లే ఈ సంఘటన చోటుచేసుకున్నట్లు సమాచారం. ఆర్జిత సేవల రద్దుపై ఆలయ అధికారులు పీఆర్వో కార్యాలయానికి స్పష్టమైన సమాచారం ఇవ్వలేదని తెలుస్తోంది.

పూడిమడక రోడ్డు విస్తరణ పనులు వేగవంతం

కలెక్టర్ విజయకృష్ణన్



మునగపాకలో బ్రిడ్జి పనులను పరిశీలిస్తున్న కలెక్టర్ విజయకృష్ణన్

మునగపాక: పూడిమడక రోడ్డు విస్తరణ పనులు వేగవంతం కావాలని కలెక్టర్ విజయకృష్ణన్ ఆదేశించారు. మునగపాక కృష్ణంరాజు కాలువపై నిర్మిస్తున్న బ్రిడ్జి పనులను ఆమె మంగళవారం స్థానిక ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్‌తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వర్షాకాలం లోగా బ్రిడ్జి పనులు పూర్తయ్యేలా చూడాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. రహదారి విస్తరణలో భూములు, గృహాలు కోల్పోయే నిర్వాసితులకు ప్రభుత్వం మెరుగైన పరిహారం అందిస్తుందన్నారు. తహసీల్దార్ ఆదిమహేశ్వరరావు, అధికారులు పాల్గొన్నారు.

నిశీధి వేళలో గ్రావెల్ మాఫియా అలజడి

- వెంకటాపురం కొండలో గ్రావెల్ తవ్వేందుకు యత్నం
- వాహనాలను అడ్డుకున్న స్థానికులు
- కూటమి నేతలు రంగంలోకి దిగినా తేలని పంచాయితీ
- తాత్కాలికంగా విరమించిన తవ్వకందారులు



వెంకటాపురం కొండ వద్ద గ్రావెల్ తవ్వకం కోసం తీసుకొచ్చిన జేసీబీ

రాంబిల్లి(అచ్యుతాపురం): రాష్ట్రంలో అతి పొడవైన కొండల్లో ఒకటైన చోడపల్లి – కొత్తూరు కొండను మింగేసే ప్రయత్నమిది.. అంతా నిద్రకు ఉపక్రమిస్తున్న వేళ ఉన్నపళంగా గ్రావెల్ మాఫియా వాలిపోయింది. అక్కడ చీకటిని చీల్చుకుంటూ వస్తున్న వెలుగుల్ని చూసి గ్రామస్తులు వెళ్లగా.. పది లారీలు, ఒక జేసీబీ కనిపించాయి. ఇక్కడ గ్రావెల్ తవ్వకాలకు ఎట్టిపరిస్థితుల్లోనూ అంగీకరించేది లేదంటూ అడ్డుకున్నారు. స్థానిక కూటమి నేతలు రంగంలోకి దిగినా వారు వెనక్కి తగ్గకపోవడంతో తవ్వకాలు నిలిచిపోయాయి. యలమంచిలి నియోజకవర్గం రాంబిల్లి మండలం వెంకటాపురానికి ఆనుకొని కొండ పరిధిలో సోమవారం రాత్రి ఈ ఘటన చోటు చేసుకుంది.

గ్రావెల్‌కు ఉన్న డిమాండ్ వల్లే..?

యలమంచిలి నియోజకవర్గంలో గ్రావెల్‌కు ఉన్న డిమాండ్ అంతా ఇంతా కాదు. అటవీ శాఖ, పర్యావరణ నిబంధనల మేరకు నియోజకవర్గంలోని చాలా కొండల్లో ఎటువంటి మైనింగ్ తవ్వకాలకు అనుమతి లేదు. లే -అవుట్లకు, రహదారి విస్తరణ పనులకు, పరిశ్రమలకు, ఇతరత్రా అవసరాల కోసం గ్రావెల్ డిమాండ్ అధికంగా ఉంది. దీని దృష్ట్యా రాత్రి వేళల్లో గ్రావెల్ తవ్వి తస్కరించుకుపోతున్నారు. అది కూడా ఎటువంటి సీనరైజ్ చెల్లించకుండా, స్థానికుల్ని సంప్రదించకుండా తరలించడంతో నియోజకవర్గంలో గ్రావెల్ తవ్వకాల వివాదం రాజుకునే ఉంది. తాజాగా సోమవారం రాత్రి 10 లారీలు, ఒక పెద్ద జేసీబీ చేరుకుని గ్రావెల్‌ను తవ్వేందుకు సమాయత్తమయ్యారు. దీంతో స్థానికులు అడ్డుకున్నారు. ఈ క్రమంలోనే గ్రావెల్ వ్యవహారాలు చూసే స్థానిక కూటమి ప్రతినిధి బంధువు, ఎం.జగన్నాథపురానికి చెందిన నేత, అచ్యుతాపురానికి చెందిన నేత, రాంబిల్లికి చెందిన నేత రంగంలో దిగి స్థానికుల్ని అడ్డుకోవద్దని కోరారు. ఈ పంచాయితీ తేలకపోవడంతో తవ్వకాలను తాత్కాలికంగా ఆపేసినట్లు సమాచారం.

రాత్రి వేళ జోరుగా తవ్వకాలు

ప్రధానంగా రాంబిల్లి, అచ్యుతాపురం, మునగపాక మండలాల్లో రాత్రిళ్లు గ్రావెల్ తవ్వకాల అలజడి రేగుతోంది. ఇటీవల కాలంలో ఎర్రవరం కొండల వద్ద, కొండకర్ల కొండల వద్ద, పాటిపల్లి కొండల వద్ద, పంచదార్ల కొండల వద్ద గ్రావెల్ తవ్వకాలు చేపడుతున్న ముఠా స్థానికుల అభ్యంతరాలు, ఫిర్యాదులతో తాత్కాలికంగా నిలిపివేసింది. తాజాగా వెంకటాపురం కొండలపై దృష్టి సారించడంతో వివాదం మొదలైంది. స్థానికుల సహకారంతో సాధ్యమైనంత త్వరలోనే గ్రావెల్ తవ్వకాలు మొదలు పెట్టాలనే యోచనతో కూటమి పెద్దలు ఉన్నట్లు ఆరోపణలు ఉన్న నేపథ్యంలో మైనింగ్ అధికారులు ఎలా స్పందిస్తారో వేచి చూడాలి.

విద్యుదాఘాతానికి మహిళా రైతు బలి



మృతదేహం వద్ద రోదిస్తున్న కుటుంబ సభ్యులు, బంధు మిత్రులు



చెల్లయమ్మ (ఫైలు)

కశింకోట: మండలంలోని ఏఎస్ పేట శివారు గొబ్బూరు పాలెంలో మంగళవారం ఓ మహిళా రైతు విద్యుదాఘాతానికి గురై మృతి చెందింది. సీఐ స్వామినాయుడు వివరాల ప్రకారం.. జెట్టపురెడ్డితునికి చెందిన చవితిన చెల్లయమ్మ (54) గొబ్బూరుపాలెం వద్ద తన చెరకు తోటకు నీరు పెట్టడానికి వెళ్లి వ్యవసాయ విద్యుత్ మోటారు స్విచ్చాన్ చేసింది. ఆ సమయంలో విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందింది. కుమారుడు రమణబాబు ఇచ్చిన ఫిర్యా దు మేరకు ఎస్ఐ కె.రమణమ్మ సంఘటనా స్థలాన్ని సందర్శించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

లింగ నిర్ధారణ చేసిన వారిపై కఠిన చర్యలు

- ఆడపిల్లల రక్షణ బాధ్యత మనదే
- డీఆర్వో సత్యనారాయణరావు

తుమ్మపాల: గర్భస్థ శిశు లింగ నిర్ధారణ చేసే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని జిల్లా రెవెన్యూ అధికారి సత్యనారాయణరావు అధికారులను ఆదేశించారు. గర్భస్థ శిశు లింగ నిర్ధారణ చట్టంపై కలెక్టరేట్‌లోని మంగళవారం తన చాంబర్‌లో జిల్లా స్థాయి కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గర్భస్థ శిశు లింగ నిర్ధారణ చట్టం 1994ను కఠినంగా అమలు చేయాలన్నారు. జిల్లాలో ప్రస్తుతం లింగనిష్పత్తి వెయ్యి మంది బాలురు, 972 బాలికలుగా ఉందన్నారు. లింగ నిష్పత్తి సమానంగా ఉండేందుకు చర్యలు చేపట్టాలన్నారు. లింగ నిష్పత్తి మండలాల వారీగా సమీక్షిస్తూ తక్కువగా ఉన్న మండలాల సీడీపీవోలు మరింత సమర్థవంతమైన పర్యవేక్షణ చేయాలని సూచించారు. బాలికలపై వివక్ష చూపకూడదని తెలిపారు. ఏ లేబొరేటరీగాని, స్కానింగ్ కేంద్రం గాని గర్భస్థ పిండం లింగాన్ని తెలిపే ఉద్దేశంతో చేయరాదన్నారు. చట్టాన్ని ఉల్లంఘించిన వారికి మూడేళ్ల జైలు శిక్ష, రూ.10 వేల జరిమానా విధిస్తారన్నారు. లింగ నిర్ధారణ పరీక్షల ద్వారా ఆడ శిశువు అని తెలిసి గర్భస్రావాలు చేయించడం వంటి సమాచారం తెలిస్తే 102, 104 టోల్ ఫ్రీ నంబరుకు లేదా ఆన్‌లైన్ గ్రీవియన్స్ (pcpndt.ap.gov.in) ద్వారా తెలియజేయాలని సూచించారు. ఆడపిల్ల విలువ కట్టలేనిదని వారి రక్షణ బాధ్యత మనదేనని అన్నారు. ఏఎన్ఎం, ఆశాలు గృహ సందర్శనాల ద్వారా ఆడపిల్లల సంరక్షణ ప్రాముఖ్యతను తెలియజేయాలని సూచించారు. నూతన వధూవరులకు, గర్భిణులకు, అత్త మామలకు దీనిపై అవగాహన కల్పించాలన్నారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి శాంతిప్రభ మాట్లాడుతూ జిల్లాలో 73 స్కానింగ్ కేంద్రాలు ఉన్నాయని, కొత్తగా 03 కేంద్రాలు గుర్తింపు కోసం, రెండు కేంద్రాలు రెన్యువల్ కోసం, ఒక కేంద్రం మోడిఫికేషన్ కోసం దరఖాస్తులు వచ్చాయన్నారు. స్కానింగు కేంద్రాలను మూడు నెలలకు ఒకసారి తనిఖీలు చేస్తున్నామన్నారు. డెకాయ్ ఆపరేషన్ చేపడుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ మోహన్‌రావు, స్త్రీ శిశు సంక్షేమ శాఖ పీడీ అనంతలక్ష్మి, డిప్యూటీ డీఎంహెచ్‌వోలు బాలాజీ, కె.వి. జ్యోతి, ఇతర కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



గర్భస్థ శిశు లింగ నిర్ధారణ చట్టం జిల్లా కమిటీ సమావేశంలో మాట్లాడుతున్న డీఆర్వో సత్యనారాయణరావు

టీడీపీలో బయటపడ్డ వర్గ విభేదాలు

- ఎమ్మెల్యే, బత్తుల మధ్య వర్గపోరు
- రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ బత్తుల రాకతో డుమ్మా కొట్టిన ఎమ్మెల్యే
- ఎమ్మెల్యే రాక కోసం ఎదురు చూసిన అధికారులు
- సమావేశం ఆలస్యంపై ఎంపీడీవోను నిలదీసిన సభ్యులు



ఎమ్మెల్యే రాకపోవడంతో ఖాళీగా ఉన్న వేదిక కుర్చీలు



సభ ఆలస్యంపై ఎంపీడీవోను ప్రశ్నిస్తున్న సభ్యులు

బుచ్చెయ్యపేట: చోడవరం ఎమ్మెల్యే కె.ఎస్.ఎన్.ఎస్ రాజు, రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ బత్తుల తాతయ్యబాబు మధ్యన వర్గ పోరు తారస్థాయికి చేరింది. నెల రోజుల కిందట ఎమ్మెల్యే రాజు బుచ్చెయ్యపేటలో మండల టీడీపీ కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశం ఏర్పాటు చేశారు. స్థానికంగా ఉన్న జిల్లా టీడీపీ అధ్యక్షునిగా ఉన్న తాతయ్యబాబుకు సమాచారం ఇవ్వకపోగా కటౌటులో తాతయ్యబాబు ఫొటో వేయలేదు. దీనిపై తాతయ్యబాబుతో పాటు అతని వర్గీయులు మేడివాడ రమణ, తలారి శంకర్,సయ్యపురెడ్డి మాధవరావు ఎమ్మెల్యేపై ఆగ్రహం చెందారు. మంగళవారం మండల కేంద్రంలో జరిగే సర్వసభ్య సమావేశానికి వస్తున్నానని ఎమ్మెల్యే రాజు ముందుగానే అధికారులకు, నాయకులకు సమాచారం అందించారు. అప్పటికే రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ బత్తుల తాతయ్యబాబు మండల సమావేశానికి విచ్చేశారు. ఎమ్మెల్యే రాజు అనుచరులు తాతయ్యబాబు మండల సమావేశానికి వచ్చినట్టు సమాచారం అందించారు. పదిన్నరకు ప్రారంభం కావాల్సిన మండల సమావేశం మధ్యాహ్నం 12 గంటలు అవుతున్నా ఎమ్మెల్యే రాకపోవడంతో సభ ప్రారంభం కాలేదు. దీంతో పలు గ్రామాల నుంచి వచ్చిన సభ్యులు అసలు సమావేశం ఉందా లేదా అంటూ ఎంపీడీవో విజయలక్ష్మిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎట్టకేలకు ఎంపీడీవో రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ తాతయ్యబాబు గౌరవ అధ్యక్షుడిగా మండల సమావేశాన్ని నడిపించారు. టీడీపీలో గ్రూపు రాజకీయాల వల్ల ఎవరి వైపు వెళ్లాలో తెలియడం లేదంటూ సమావేశానికి వచ్చిన సర్పంచ్‌లు, ఎంపీటీసీలు గుసగుసలాడుకున్నారు.

నేడు ఆపరేషన్ అభ్యాస్

- సివిల్ మాక్ డ్రిల్‌కు సర్వం సిద్ధం
- అత్యవసర సమయాల్లో పౌరుల స్పందనపై అవగాహన



విశాఖ సిటీ: ప్రశాంత విశాఖ యుద్ధ క్షేత్రంగా మారనుంది. వైమానిక దాడుల హెచ్చరిక సైరన్ మోత మోగనుంది. శత్రు దేశ యుద్ధ విమానాలు.. క్షిపణులు.. డ్రోన్లు దూసుకొస్తున్న వేళ.. పౌరుల ఆత్మ రక్షణకు తీసుకోవాల్సిన చర్యలపై మాక్ డ్రిల్ జరగనుంది. రక్షణ దళాలు, పోలీసులు, ఫైర్, రెవెన్యూ, వైద్య, ఇతర శాఖల అధికారులు.. సంక్షోభ సమయాల్లో పౌరుల ప్రాణ, ఆస్తి నష్టాలు వాటిల్లకుండా అనుసరించాల్సిన విధానాలను వివరించనున్నారు. కశ్మీర్‌లో ఉగ్రదాడి తరువాత భారత్–పాకిస్తాన్‌ల మధ్య ఉద్రిక్తతలు తారాస్థాయికి చేరాయి. ఇరుదేశాల మధ్య యుద్ధ మేఘాలు కమ్ముకోవడంతో కేంద్ర హోం శాఖ ముందస్తు చర్యలకు సిద్ధమైంది. సంక్షోభ సమయంలో పరిస్థితులను ఎలా ఎదుర్కోవాలి, పౌరులు తమ ప్రాణా లు ఎలా కాపాడుకోవాలన్న విషయంపై 'ఆపరేషన్ అభ్యాస్' పేరుతో సివిల్ మాక్ డ్రిల్ నిర్వహించాలని ఆదేశాలు జారీ చేసింది. దీంతో బుధవారం వన్‌టౌన్ ప్రాంతం, సీతమ్మధార ఆక్సిజన్ టవర్స్ వద్ద ఈ డ్రిల్ నిర్వహించేందుకు అన్ని శాఖల సమన్వయంగా అధికారులు ఏర్పాట్లు చేశారు.

క్వీన్‌మేరీ పాఠశాల, ఆక్సిజన్ టవర్స్ వద్ద డ్రిల్

దేశంలో దాడులు జరిగే అవకాశం ఉన్న ప్రాంతాలను కేంద్ర హోం శాఖ మూడు కేటగిరీలుగా విభజించింది. ఇందులో విశాఖ కేటగిరీ–2లో ఉంది. యుద్ధమే అనివార్యమైతే విశాఖను కూడా పాకిస్తాన్ టార్గెట్‌గా చేసుకునే అవకాశం ఉందని కేంద్ర హోం శాఖ భావిస్తోంది. అటువంటి అత్యవసర పరిస్థితుల్లో ప్రజలు ఎలా స్పందించాలనే దానిపై అవగాహన కల్పించేందుకు జిల్లా యంత్రాంగం సాయంత్రం 4 గంటలకు వన్‌టౌన్ ప్రాంతంలో ఉన్న క్వీన్ మేరీస్ పాఠశాల వద్ద, రాత్రి 7.15 గంటలకు ఆక్సిజన్ టవర్స్ వద్ద మాక్ డ్రిల్ నిర్వహించనుంది. ఆ సమయంలో నగరంలో సైరన్ మోత మోగుతుంది. వెంటనే బహిరంగ ప్రదేశాల్లో ఉన్న ప్రజలు సురక్షిత ప్రాంతాలకు వెళ్లాలి. పోలీసులు, ఫైర్, ఎస్‌డీఆర్ఎఫ్, వైద్య, రెవెన్యూ, ఇతర స్థానిక అధికారులు ఆ ప్రాంతానికి చేరుకుంటారు. అత్యవసర పరిస్థితుల్లో ఎలా వ్యవహరించాలో ప్రజలకు అవగాహన కలిగిస్తారు. విద్యుత్ సరఫరా నిలిపివేసి, సురక్షిత ప్రాంతాలకు ప్రజలను తరలించే ప్రక్రియను చేపట్టనున్నారు. సైరన్ మోగినప్పుడు పౌరులు ఎలా స్పందించాలి? విద్యుత్ సరఫరా నిలిచిపోయినప్పుడు (బ్లాక్ అవుట్) తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ప్రథమ చికిత్స కోసం ఇళ్లలో ఉంచుకోవాల్సిన అత్యవసర వస్తువులు, మందులపై ప్రజలకు వివరించనున్నారు.

నేవీ, సివిల్ డిఫెన్స్ ఆధ్వర్యంలో...

అలాగే నేవీ, సివిల్ డిఫెన్స్ ఆధ్వర్యంలో పాత పోస్టాఫీస్ వద్ద గల ఎస్‌బీఐ, కేజీహెచ్ వద్ద గల ఏఎంసీ మహిళా హాస్టల్, దొండపర్తి వద్ద గల డీఆర్ఎం ఆఫీస్, వన్‌టౌన్‌లోని రోజ్ హిల్స్, ఏయూ అవుట్ గేట్ వద్ద ఉన్న జీవీపీ కాలేజ్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ వద్ద మాక్ డ్రిల్ నిర్వహించనున్నారు. ఏయూ నార్త్ క్యాంపస్ వద్ద ఉదయం 10 గంటలకు ఎన్‌సీసీ, ఎన్‌డీఆర్ఎఫ్ ఆధ్వర్యంలో మాక్ డ్రిల్ చేపట్టనున్నారు.

మాక్ డ్రిల్ విజయవంతంగా నిర్వహించాలి

మహారాణిపేట: మాక్ డ్రిల్‌ను విజయవంతంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ హరేందిరప్రసాద్ తెలిపారు. మంగళవారం కలెక్టరేట్‌లో మాక్ డ్రిల్ సన్నద్ధతపై సమీక్ష సమావేశం నిర్వహించారు. మాక్ డ్రిల్ విధివిధానాలపై వారికి స్పష్టమైన మార్గదర్శకాలను జారీ చేశారు. యుద్ధం జరిగితే తమను తాము ఎలా రక్షించుకోవాలనే విషయంపై ప్రజలకు అవగాహన కల్పించనున్నట్లు వివరించారు.

40 కిలోల గంజాయి స్వాధీనం

- పట్టుబడిన నలుగురు నిందితులు
- వారిలో ఒక మహిళ




గంజాయి నిందితులతో పోలీసులు

కోటవురట్ల: ఉన్నతాధికారుల ఆదేశాలతో వాహన తనిఖీ నిర్వహించిన పోలీసులకు 40 కిలోల గంజాయి పట్టుబడింది. నక్కపల్లి సర్కిల్ సీఐ రామకృష్ణ తెలిపిన వివరాలివి... మంగళవారం యండపల్లి వద్ద వాహన తనిఖీలు చేస్తుండగా కారులో గంజాయిని తరలిస్తూ నలుగురు వ్యక్తులు పట్టుబడ్డారు. వారిలో ఓ యువతి కూడా ఉంది. గంజాయిని, కారును సీజ్ చేసి పోలీసు స్టేషన్‌కు తరలించారు. ఉత్తరప్రదేశ్‌కు చెందిన షెహన్‌వాజ్, షహదాబ్, రుక్సానా కలిసి చింతపల్లి మండలం రేగళ్ల గ్రామానికి చెందిన రాజుబాబు సహకారంతో 40 కిలోల గంజాయిని కొనుగోలు చేశారు. దాన్ని ఉత్తరప్రదేశ్‌కు తరలించేందుకు ప్రణాళిక చేశారు. ఇందులో భాగంగా కారులో చింతపల్లి నుంచి కోటవురట్ల మీదుగా అడ్డురోడ్డుకు వెళ్లి అక్కడి నుంచి తుని మీదుగా ఢిల్లీ వెళ్లేందుకు ప్లాన్ చేశారు. అక్కడ గంజాయిని విక్రయించి సొమ్ము చేసుకునేందుకు ప్రణాళిక చేశారు. పోలీసుల తనిఖీలో గంజాయితో పాటు నలుగురూ పట్టుబడ్డారు. వీరిలో ఎ -1 ముద్దాయి షెహన్‌వాజ్ గతంలో నర్సీపట్నం రూరల్ పోలీసు స్టేషన్ పరిధిలో 74/21 కేసులో ఎ–3 ముద్దాయిగా ఉన్నట్టు సీఐ తెలిపారు. దీనిపై పూర్తి స్థాయిలో దర్యాప్తు చేస్తున్నామన్నారు. ఎస్ఐ రమేష్, సిబ్బంది పాల్గొన్నారు.

ఏయూలో విద్యార్థులకు చోటేదీ..?

- పోటీ పరీక్షార్థులకు మొండిచేయి
- వసతి కోసం వేడుకున్నా పట్టని అధికారులు



వీసీ చాంబర్ ముందు వేచి ఉన్న విద్యార్థులు

విశాఖ విద్య: పోటీ పరీక్షలకు సన్నద్ధమయ్యే క్రమంలో వసతి కావాలని కోరినా.. యూనివర్సిటీ అధికారులు ఏమాత్రం పట్టించుకోకపోవడంతో విద్యార్థులు నిరసన వ్యక్తం చేశారు. మంగళవారం సాయంత్రం వర్సిటీ వైస్ ఛాన్సలర్‌ను కలిసేందుకు వెళ్లిన విద్యార్థులను అనుమతించకపోవటంపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. వైస్ ఛాన్సలర్ చాంబర్ వద్దే విద్యార్థులు పడిగాపులు కాశారు. డీఎస్సీ, ఇతర పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే వర్సిటీ విద్యార్థులకు ఏటా వేసవి సెలవుల్లో యూనివర్సిటీలో వసతి కల్పించేవారు. కానీ ఈ సంవత్సరం వర్సిటీ వసతి గృహాలకు జీవీఎంసీ తాగునీరు రావటం లేదనే కారణంతో విద్యార్థులకు అవకాశం కల్పించకపోవటంపై తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే వర్సిటీ విద్యార్థులకు వసతి కల్పిస్తామని హామీ ఇచ్చి కూడా వైస్ ఛాన్సలర్, రిజిస్ట్రార్, ప్రిన్సిపాళ్లు, చీఫ్ వార్డెన్లు చుట్టూ తిప్పించుకొని చివరకు నిరాశ మిగిల్చారని వారు ఆవేదన వ్యక్తం చేశారు.

క్లుప్తంగా

విద్యార్థులకు చిత్ర లేఖనం పోటీలు


విద్యార్థులు గీసిన చిత్రలేఖనం ప్రదర్శన

కశింకోట: మండలంలోని తాళ్లపాలెం శాఖ గ్రంథాలయంలో విద్యార్థులకు మంగళవారం చిత్ర లేఖనం పోటీలు నిర్వహించారు. వేసవి విజ్ఞాన శిక్షణ తరగతుల్లో భాగంగా ఆరో రోజు డ్రాయింగ్ ఉపాధ్యాయుడు హరనాథ్ ఆధ్వర్యంలో నిర్వహించిన పోటీలో విద్యార్థులు ఉత్సాహంగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిత్ర లేఖనంలో రాణించడానికి తర్ఫీదు పొందడం అవసరమన్నారు. విజ్ఞానదాయకమైన విషయాలను నేర్చుకోవడానికి గ్రంథాలయాలను వినియోగించుకోవాలన్నారు. పుస్తక పఠనం అలవర్చుకోవాలని కోరారు. కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి కె. జగన్నాథం పాల్గొన్నారు.

వృద్ధునికి ఆశ్రయం కల్పించిన పోలీసులు


రాంగోపాల్‌ను లయోలా వృద్ధాశ్రమానికి అప్పగిస్తున్న పోలీసులు

పెందుర్తి: ఒంటరి వృద్ధునికి పెందుర్తి పోలీసులు స్థానిక లయోలా వృద్ధాశ్రమంలో ఆశ్రయం కల్పించారు. గాజువాకకు చెందిన చామర్తి రాంగోపాల్ (70) ఓ షాపింగ్‌మాల్‌లో పని చేసి పదవీ విరమణ పొందాడు. కుటుంబ సభ్యులు ఎవరూ లేకపోవడంతో ఒంటరిగా జీవిస్తున్నాడు. ఈ క్రమంలో జీవనం ఇబ్బందికరంగా మారడంతో పినగాడికి చెందిన తన పూర్వ సహోద్యోగి సహకారం కోరాడు. అతనికి కుటుంబ బాధ్యతలు ఉండడంతో రాంగోపాల్‌కు ఎక్కడైనా ఆశ్రయం కల్పించాలని కోరుతూ దరఖాస్తు చేశాడు. స్పందించిన సీఐ కె.వి. సతీష్‌కుమార్ వెంటనే స్థానిక లయోలా వృద్ధాశ్రమ నిర్వాహకుడు దొడ్డి ప్రకాష్‌తో మాట్లాడి రాంగోపాల్‌ను ఆశ్రమంలో చేర్పించారు.

కరాటేలో యలమంచిలి విద్యార్థుల ప్రతిభ


కరాటేలో పతకాలు సాధించిన విద్యార్థులు

యలమంచిలి రూరల్: ఏపీ కిక్ బాక్సింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 4న విశాఖపట్నం ఆంధ్ర విశ్వవిద్యాలయంలో నిర్వహించిన కరాటే పోటీల్లో యలమంచిలి కరాటే స్కూల్‌కు చెందిన 12 మంది విద్యార్థులు ప్రతిభ చూపారు. నలుగురు విద్యార్థులు కశింకోట శ్రీను, కె.హాసిని, ఎస్.కె.ఆఫ్రిన్, ఈ.రాకేష్ బంగారు పతకాలు, 8 మంది విద్యార్థులు ఎం.మనోజ్ కుమార్, కె.హేమశ్రీ చంద్రిక, కె.హాసిని, బి.జ్యోతిష్, ఎస్.కె.ఆయేషా, ఐ.ప్రీతమ్, కె.కార్తీక్, ఈ.సాహితి వెండి పతకాలు కైవసం చేసుకున్నారు. మరో 9 మంది విద్యార్థులు బ్రాంజ్ మెడల్స్ పొందారు. విజేతలను మంగళవారం సాయంత్రం స్థానిక కరాటే స్కూల్‌లో అభినందించారు.

బెల్లం ధరలు

అనకాపల్లి బెల్లం మార్కెట్‌కు మంగళవారం 597 దిమ్మలు వచ్చాయి.

దిమ్మల రకం	కనిష్ట ధర	గరిష్ట ధర
మొదటి రకం	4,340	4,780
రెండో రకం	3,800	4,300
మూడో రకం	3,500	3,730

అనకాపల్లి సినిమాలు

రాజా : రెట్రో
సత్యనారాయణ స్క్రీన్-1: అర్జున్ సన్‌ఆఫ్ వైజయంతి
సత్యనారాయణ స్క్రీన్-2 : థండర్ బోల్ట్స్
పర్తిసాయి : హిట్-3
షిర్డీసాయి : ఓదెల 2
వెంకటేశ్వర : జింఖానా
శ్రీసత్య : సారంగపాణి జాతకం
రామచంద్ర : తుడురుమ్

రక్త నిల్వలు

అనకాపల్లి: జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 55 యూనిట్ల రక్త నిల్వ ఉంది. ఏ పాజిటివ్ 17, బీ పాజిటివ్ -14, ఓ పాజిటివ్ -22, ఏబీ పాజిటివ్ -3 యూనిట్లు శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్ బ్యాంక్ టెక్నీషియన్ యు. లోకేష్ 9703619706ను సంప్రదించాలని కోరారు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లి: ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా మంగళవారం 384 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 336 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ప్రతినిధి 08924 -223595 నెంబర్‌ను సంప్రదించవచ్చు.


ఖరీఫ్ సాగు కోసం పొలాల్లో పూర్తిచేసిన దుక్కులు

పచ్చిరొట్ట సాగు.. భూసారం బాగు

50 శాతం రాయితీపై పచ్చిరొట్ట విత్తనాలు

15 రైతు సేవా కేంద్రాల్లో పంపిణీకి సిద్ధం

సద్వినియోగం చేసుకోవాలంటున్న వ్యవసాయ అధికారులు

అధిక దిగుబడులు సాధించాలన్న ఆత్రుతతో అన్నదాతలు విచ్చలవిడిగా రసాయనాలు, ఎరువులు వాడేస్తున్నారు. పర్యవసానంగా ఆహార పంటలు కలుషితమవుతున్నాయి. భూసారం దెబ్బతింటోంది. క్రమంగా పంటల్లో సూక్ష్మ పోషకాలు లోపిస్తున్నాయి. చీడ పీడల ఉధృతి పెరుగుతుంది. ఈ నేపథ్యంలో రసాయనాలు, ఎరువులకు ప్రత్యామ్నాయంగా పచ్చిరొట్ట వాడాలని వ్యవసాయాధికారులు సూచిస్తున్నారు.

తుమ్మపాల: ప్రస్తుత వ్యవసాయంలో ఎరువులు, పురుగు మందులు వాడకం ఎక్కువ కావడంతో భూసారం మరింత క్షీణతకు గురవుతోంది. పంటకు అవసరమైన పోషకాలు అందించేందుకు 80 శాతం మంది రైతులు రసాయన ఎరువులపైనే ఆధారపడుతున్నారు. వీటితో దిగుబడి ఆశాజనకంగా ఉంటున్నా, భూమి సారాన్ని కోల్పోతోంది. పంటల్లో పురుగులు, తెగుళ్ల బారిన పడేందుకు అవకాశాలే ఎక్కువ. దీంతో రైతులకు సాగు ఖర్చు పెరగడంతో పాటు గాలి, నీరు, భూమి, పంట ఉత్పత్తులు రసాయనాల బారిన పడుతున్నాయి. ఈ దశలో వ్యవసాయంలో పచ్చిరొట్ట పైర్లు కీలక పాత్ర పోషిస్తున్నాయి. పచ్చిరొట్ట విత్తనాలను పంట భూముల్లో ముందుగా కలియ దున్నడం వల్ల భూసారాన్ని పెంచుకోవచ్చని వ్యవసాయాధికారులు తెలియజేస్తున్నారు. జనుము, జీలుగ, పిల్లి పెసర వంటి విత్తనాలను ప్రభుత్వం 50 శాతం రాయితీపై అందిస్తోంది. కాని మండలంలో వీటి వినియోగంపై రైతులకు అవగాహన లేక అతి తక్కువ స్థాయిలో వినియోగిస్తున్నారు.

పుష్కలంగా పోషకాలు ..

వరి, ఆరుతడి, బోర్ల కింద సాగుచేసే భూముల్లో జీలుగ, జనుము, పిల్లిపెసర విత్తనాలు వేస్తారు. నారుపోసి పొలం దున్నే సమయానికి అంటే 50-60 రోజుల్లో పంట పూతకు వస్తుంది. ఆ సమయంలో పొలంలో కలియ దున్నడం వల్ల వరి పంటకు కావాల్సిన ముఖ్య పోషకాలైన కాల్షియం, మెగ్నీషియం, సల్ఫర్, సూక్ష్మ పోషకాలు, జింక్, బోరాన్, ఇనుము, మాంగనీస్ వంటివి పుష్కలంగా అందుతాయి. భూమిలో కర్బన శాతం తగ్గి, నత్రజని శాతం పెరుగుతుంది. కొద్దిమొత్తంలో రసాయన ఎరువుల వేసినా పంటకు ఉపయోగపడేలా చేస్తా యి. నీటి ఎద్దడి ఏర్పడినా తట్టుకునే శక్తి పెరుగుతుంది. పంటకు ఉపయోగపడే సూక్ష్మజీవుల సంఖ్య పెరగడమే కాకుండా పురుగులు, తెగుళ్ల బెడద ఉండదు.

సాగులో పాటించాల్సిన మెలకువలు..

- పంట కోయగానే నేలలో మిగిలిన తేమను సద్వినియోగం చేసుకుని పచ్చిరొట్ట ఎరువులు విత్తుకోవాలి.
- తేమ చాలని ప్రాంతాల్లో వేసవిలో దుక్కి దున్ని తొలకరి వర్షాలు పడగానే విత్తుకోవాలి.
- నీటి వసతి కలిగిన ప్రాంతాల్లో వేసవిలో సాగు చేయడం లాభదాయకం
- వరి పొలాల్లో పచ్చిరొట్ట పెంచి పూత సమయంలో కలియ దున్నాలి.

అవగాహన లేక తక్కువ మంది వినియోగం

మండలంలో 32 గ్రామ పంచాయతీలకు గాను ఒకట్రెండు గ్రామాలు మినహా అన్ని గ్రామాల్లోను వరి సాగు జరుగుతుంది. అయినప్పటికీ పచ్చిరొట్ట విత్తనాలపై అవగాహన లేక కేవలం కొన్ని గ్రామాల్లో అతి తక్కువ మంది రైతులు మాత్రమే వీటి వినియోగంపై ఆసక్తి చూపిస్తున్నారు. బవులువాడ, చింతనిప్పుల అగ్రహారం, గొలగాం, కుంచంగి, తుమ్మపాల, తగరంపూడి, పిసినికాడ, గవరపాలెం, వెంకుపాలెం, ఊడేరు, మామిడిపాలెం, మార్టూరు, పాపయ్యపాలెం, రేబాక, శంకరం గ్రామాల్లో మాత్రమే ఈ ఏడాది తక్కువ సంఖ్యలో రైతులు నమోదు చేసుకున్నారు. ఈ మేరకు వ్యవసాయ అధికారుల లెక్కల ప్రకారం జనుము - 8.4, జీలుగు-5, పిల్లి పెసర- 2.28 మొత్తం 16 క్వింటాళ్లు పచ్చిరొట్ట విత్తనాలు మాత్రమే ఈ నెలలో పంపిణీకి రైతు సేవా కేంద్రాలకు రానున్నాయి.

అందుబాటులో విత్తనాలు..

మండల పరిధిలో ఈ ఏడాది 15 రైతు సేవా కేంద్రాలు ద్వారా రైతులకు పచ్చిరొట్ట విత్తనాలను పంపిణీ చేసేందుకు వ్యవసాయ అధికారులు సిద్ధంగా ఉన్నారు. ముందుగా రైతులు ఆధార్ కార్డులు తీసుకుని రైతు సేవా కేంద్రాల వద్దకు వెళ్లి రిజిస్ట్రేషన్ చేసుకుని వారికి కావాల్సిన పచ్చిరొట్ట విత్తనాలను ఆర్డర్ చేసుకోవాలి. అయితే మండలంలో అనేక గ్రామాల రైతులకు వీటిపై అవగాహన లేక భూముల్లో ముందుగా వేసేందుకు ముందుకు రావడం లేదు. వర్షాలు పడటంతో పొలాల్లో దుక్కులు చేస్తున్నప్పటికీ ఖరీఫ్ సాగు వరకు ఖాళీగానే ఉంచుతున్నారు. దీంతో మళ్లీ కలుపు పెరిగి దుమ్ములకు షరామామూలుగా పొలాలు తయారవుతున్నాయి. రైతులకు పూర్తి అవగాహన చేసినట్లయితే పొలాల్లో పచ్చిరొట్ట విత్తనాలు చల్లి ఖరీఫ్ నాటికి పొలాలను సిద్ధంగా ఉంచుతారు. దీంతో పొలాలు సారవంతంగా తయారయ్యి ఖరీఫ్‌లో మంచి దిగుబడులు వస్తాయి. మండలంలో 2,500 హెక్టార్ల మేర ఖరీఫ్ సాగు విస్తీర్ణం ఉన్నప్పటికీ కేవలం 16 క్వింటాళ్ల వరకే డిమాండ్ ఉండటంతో వ్యవసాయ అధికారులు ఇప్పటికే ఏపీఎస్ఎస్‌డీసీ జిల్లా మేనేజర్ (సీడ్స్)కు డిమాండ్ పెట్టినట్లు తెలిపారు. ఈ నెలలో పచ్చిరొట్ట విత్తనాలు రానున్నాయని తెలిపారు.


ఏపీ సీడ్స్ జిల్లా గోదాముల్లో పచ్చిరొట్ట విత్తనాలకు డిమాండ్ ఇస్తున్న ఏవో రంగాచారి

రైతు సేవా కేంద్రాల్లో దరఖాస్తు చేసుకోవాలి



పచ్చిరొట్ట ఎరువులతో తక్కువ ఖర్చుతో భూమికి ఎక్కువ పోషకాలు అందిస్తాయి. పచ్చిరొట్ట సాగులో జీలుగ, జనుము, పిల్లిపెసర ప్రాచుర్యంలో ఉన్నాయి. భూమిలో కలియదున్నిన తర్వాత త్వరగా చీకుతాయి. ఆకుల్లో ఎక్కువ నత్రజని శాతం కలిగి ఉంటాయి. పర్యావరణం దెబ్బతినకుండా ఉంటుంది. రసాయనిక ఎరువుల ఖర్చు తగ్గుతుంది. సబ్సిడీపై అందించే పచ్చిరొట్ట విత్తనాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలి.

– పి.రంగాచారి, మండల వ్యవసాయ అధికారి, అనకాపల్లి మండలం

దుర్గాదేవి దేవాలయ వార్షికోత్సవం నేడు


దుర్గాదేవి అమ్మవారు

అనకాపల్లి టౌన్: పట్టణంలోని వేల్పులవీధి వద్ద రజక కాలనీలో దుర్గాదేవి దేవాలయం 10వ వార్షికోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఉదయం 10 గంటలకు ఆలయ ప్రాంగణంలో లోక కల్యాణార్థం వంకాయల శ్రీనివాస్ శర్మ ఆధ్వర్యంలో శ్రీలక్ష్మి గణపతి హోమం, సాయంత్రం సారె ఊరేగింపు నిర్వహిస్తామని తెలిపారు.

సర్క్యులర్‌ను అమలు చేయాలి


రిలే నిరాహార దీక్షలో పాల్గొన్న కార్మికులు

అనకాపల్లి టౌన్: 1-2019 సర్క్యులర్‌ను తక్షణమే అమలు చేయాలని ఎన్ఎంయూఏ రీజనల్ కార్యదర్శి పి.సుధాకర్ డిమాండ్ చేశారు. స్థానిక ఆర్టీసీ డిపో ఎదుట కార్మికులు చేస్తున్న రిలే నిరాహార దీక్షలు మంగళవారానికి 67వ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీ అండ్ టీ కేసుల్లో పాయింట్ల విధానం అమలు చేయాలని తెలిపారు. కార్యక్రమంలో డిపో జాయింట్ కార్యదర్శి ఎస్ వాసు, వైఎస్ కుమార్, వర్మ తదితరులు పాల్గొన్నారు.

పరిశ్రమల్లో కార్మిక చట్టాలు అమలు చేయాలి

ఎస్.రాయవరం: పరిశ్రమల యాజమాన్యాలు విధిగా కార్మిక చట్టాలు అమలు చేయాలని యలమంచిలి కోర్టు ప్యానల్ లాయర్ తుమ్మపాల నూకరాజు డిమాండ్ చేశారు. రామయ్యపట్నం గ్రామంలో నిర్వహిస్తున్న కోళ్ల ఫారాలను ఆయన మంగళవారం పరిశీలించారు. అక్కడ పని చేస్తున్న కార్మికులకు లేబర్ చట్టాలపై అవగాహన కల్పించారు. పరిశ్రమ యాజమాన్యం అందిస్తున్న సదుపాయాలపై ఆరా తీశారు. ఈ కార్యక్రమంలో స్థానిక పంచాయతీ కార్యదర్శి సంతోషి, వీఆర్వో సాంబశివరావు, తదితరులు పాల్గొన్నారు.

గాంధీ మార్కెట్లో కాలువల శుభ్రత


కుళ్లిన కాయగూరలను శుభ్రం చేసిన మార్కెట్


మార్కెట్‌లో కాలువలు శుభ్రం చేస్తున్న సిబ్బంది

సాక్షి ఎఫెక్ట్..

అనకాపల్లి టౌన్: 'గాంధీ మార్కెట్‌లో సమస్యల తిష్ట' అనే శీర్షికన మంగళవారం సాక్షి దినపత్రికలో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. పట్టణంలోని మార్కెట్‌లో రైతులు, హోల్‌సేల్, రిటైల్ వర్తకులు, ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దీంతోపాటు కుళ్లిన కాయగూరలు ఎక్కడికక్కడే వదిలేసిన వైనం, కాలువలు శుభ్రం చేయకపోవడం, పూడిక పేరుకుపోయి మురుగు పారడం వంటి అంశాలతో స్టోరీ ప్రచురితమైంది. దీనిపై స్పందించిన జీవీఎంసీ శానిటరీ సూపర్‌వైజర్ ఆర్ కుమార్, ఇన్‌స్పెక్టరు ఇన్‌చార్జి సంతోష్ కుమార్, సెక్రటరీ రవి దగ్గరుండి సిబ్బందితో శుభ్రం చేయించారు. దీనిపై స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

తుక్కు దుకాణంలో అగ్నిప్రమాదం


తుక్కు దుకాణంలో అగ్ని ప్రమాదం వలన ఎగసిపడుతున్న మంటలు, దట్టమైన పొగ


మంటలను అదుపు చేస్తున్న అగ్నిమాపక సిబ్బంది

పరవాడ: స్థానిక తహసీల్దార్ కార్యాలయానికి సమీపంలోని ఓ తుక్కు దుకాణంలో మంగళవారం మధ్యాహ్నం భారీ అగ్ని ప్రమాదం సంభవించింది. ఈ ప్రమాదంలో తుక్కు దుకాణంలోని ప్లాస్టిక్ డబ్బాలు, ఇతర సామగ్రి కాలిబూడిదయ్యాయి. దుకాణం పైనుంచి ఏర్పాటు చేసిన హైటెన్షన్ విద్యుత్ తీగల నుంచి రాలిపడిన నిప్పు రవ్వలే ఈ ప్రమాదానికి కారణమని పోలీసులు భావిస్తున్నారు. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాలు..

మంగళవారం మధ్యాహ్నం 1 గంట సమయంలో తుక్కు దుకాణంలో దట్టమైన పొగలతో కూడిన మంటలు ఎగసిపడ్డాయి. దుకాణంలో నిల్వ చేసిన ప్లాస్టిక్ వ్యర్థాలు, ప్యాకింగ్ సామగ్రి, రసాయన డబ్బాలకు మంటలు వ్యాపించడంతో పొగ, మంటలు మరింత పెరిగాయి. పరిసర గ్రామాల ప్రజలు ఉక్కిరిబిక్కిరయ్యారు. అగ్నిప్రమాద సమాచారాన్ని తెలుసుకున్న పరవాడ సీఐ ఆర్.మల్లికార్జునరావు ఘటనా స్థలికి చేరుకుని మంటల నియంత్రణకు అవసరమైన చర్యలను చేపట్టారు. అనకాపల్లి, రాంకీ అగ్నిమాపక సిబ్బంది హుటాహుటిన చేరుకుని మంటలను అదుపు చేశారు. అగ్ని ప్రమాదంతో యజమానికి తీవ్ర నష్టం సంభవించింది. ఈ తుక్కు దుకాణంలో అగ్ని ప్రమాదం సంభవించడం ఇది రెండో సారి. తుక్కు దుకాణాల్లో తరచూ అగ్ని ప్రమాదాల వల్ల పర్యావరణానికి తీవ్ర ముప్పు ఏర్పడుతోందని, ప్రమాద కారణాలపై సమగ్ర విచారణ చేపట్టాలని సిటు జిల్లా ఉపాధ్యక్షుడు గనిశెట్టి సత్యనారాయణ డిమాండ్ చేశారు. అగ్ని ప్రమాదం సంభవించిన తుక్కు దుకాణానికి ప్రభుత్వం నుంచి ఎలాంటి అనుమతులు లేవన్నారు. ఇటీవల ఇక్కడ ఓ తుక్కు దుకాణంలో రసాయన వ్యర్థాలు తుళ్లి ఓ కార్మికుడు మృతి చెందిన విషయాన్ని గుర్తు చేశారు. పరవాడలో అనుమతులు లేని తుక్కు దుకాణాలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

నల్లబ్యాడ్జీలతో నిరసన

రోలుగుంట : బుచ్చింపేట పీహెచ్‌సీ వద్ద సోమ, మంగళవారాలు పీహెచ్‌సీ పరిధిలో గల సబ్ సెంటర్లలో విధులు నిర్వహిస్తున్న ఆరోగ్య శాఖ సబ్ స్టాఫ్ ఎం.ఎల్.హెచ్.పి (మిడ్ లెవల్ హెల్త్ ప్రొవైడర్స్) తమను విమర్శిస్తున్న వైఖరిపై నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలిపారు. ఎం.ఎల్.హెచ్.పీల్లో తమపై ఉన్న చులకన భావన విడనాడాలని, రోగులకు సేవలందించడమే అందరి కర్తవ్యమని, తమపై పెత్తనం చేస్తూ తీవ్ర పదజాలంతో చేస్తున్న కించపరచే విధానం మార్చుకోవాలని నినాదాలు చేశారు.

ఆక్రమిత స్థలంలో నిర్మాణాలు అడ్డుకున్న అధికారులు


ఆక్రమణ స్థలంలో నిర్మాణాలను అడ్డుకున్న రెవెన్యూ సిబ్బంది

బుచ్చెయ్యపేట : మేజర్ పంచాయితీ వడ్డాదిలో ఆక్రమ కట్టడాలను రెవెన్యూ అధికారులు అడ్డుకున్నారు. వడ్డాది వేంకటేశ్వరస్వామి ఆర్చి ఎదురుగా ఉన్న ఆర్టీసీకి చెందిన బస్‌షెల్టర్‌ను ఇటీవల కూల్చేశారు. ఈ స్థలాన్ని ఆక్రమించి కొంతమంది కట్టడాలు చేయడంపై గ్రామస్తులు కొంతమంది అడ్డుకున్నారు. మరలా మంగళవారం ఇదే స్థలంలో నిర్మాణాలు చేయడంపై గ్రామస్తులు తహసీల్దార్ లక్ష్మి, ఎంపీడీవో విజయలక్ష్మిలకు ఫిర్యాదు చేశారు. దీంతో ఆర్ఐ శ్రావణ్‌కుమార్, వీఆర్వో కోరుకొండ మాణిక్యం ఆక్రమణ స్థలం వద్దకు వెళ్లి నిర్మాణాలు జరగకుండా అడ్డుకున్నారు.

వెలుగు వీవోఏల సమ్మె నోటీసు


వెలుగు ఏపీఎంకు సమ్మె నోటీసు అందిస్తున్న సిటు నాయకులు

పరవాడ: ఈ నెల 20న తలపెట్టిన దేశవ్యాప్త కార్మిక సమ్మెను విజయవంతం చేయాలని సిటు జిల్లా ఉపాధ్యక్షుడు గనిశెట్టి సత్యనారాయణ పిలుపునిచ్చారు. సిటు ఆధ్వర్యంలో వెలుగు కార్యాలయం వద్ద వెలుగు వీవోఏల యూనియన్ ప్రతినిధులతో కలిసి వెలుగు ఏపీఎం రంగారావుకు మంగళవారం సమ్మె నోటీసు అందించారు. అనంతరం వెలుగు వీవోఏల సంఘ అధ్యక్షురాలు పైడి లక్ష్మి మాట్లాడుతూ వీవోఏల కాలపరిమితిని రద్దు చేయాలని, కనీస వేతన చట్టం అమలు చేసి, బీమా సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. కార్మికులు పోరా టాల ద్వారా సాధించిన కార్మిక చట్టాలను యాజమాన్యాలకు అనుకూలంగా మార్పులు చేసే చర్యలను కేంద్ర ప్రభుత్వం విరమించుకోవాలన్నారు. బీజేపీ ప్రభుత్వం దొంగచాటుగా 44 కార్మిక చట్టాలను 4 లేబర్ కోడ్స్ కింద మార్చి వాటి అమలుకు ప్రయత్నాలను ముమ్మరం చేసిందన్నారు. దీన్ని నిరసిస్తూ దేశంలోని అన్ని కార్మిక, రైతు సంఘాలు మే 20న దేశవ్యాప్త సమ్మెకు పిలుపునిచ్చాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో రమాదేవి, ఉమ, వెంకటలక్ష్మి, విజయ, వరలక్ష్మి, నీలిమ, మణి పాల్గొన్నారు.

మోదకొండమ్మ ఆలయానికి భక్తుల తాకిడి

మాడుగుల: మాడుగుల మోదకొండమ్మ ఆలయానికి మంగళవారం భక్తుల తాకిడి పెరిగింది. అమ్మవారి నెల రోజుల పండగ సందర్భంగా అమ్మవారిని అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. ఆలయ ప్రాంగణంలో భక్తుల తాకిడితో పండగ వాతావరణం నెలకొంది.ఆలయ కమిటీ క్యూలైన్‌తో పాటు ఇతర సదుపాయాలు ఏర్పాటు చేయడంతో భక్తులు అమ్మవారిని ఎటువంటి ఇబ్బంది లేకుండా ప్రశాంతంగా దర్శించుకున్నారు.

మోదకొండమ్మ కొలువు ప్రారంభం : మోదకొండమ్మ కొలువు ఉత్సవం ఆలయ కమిటీతో పాటు గ్రామస్తులు ఆధ్వర్యంలో మంగళవారం వైభవంగా నిర్వహించారు. ఆలయం నుంచి మోదకొండమ్మ సతకం పట్టు వద్దకు అమ్మవారి ప్రతి రూపమైన ఘటాలు శిరస్సున పెట్టుకుని కాలినడక డప్పులు వాయిద్యాలు నడుమ సతకం పట్టు వద్దకు చేరుకున్నారు. జూన్ 3 వ తేదీ వరకు అక్కడే కొలువుదీరి భక్తులకు దర్శనమిస్తారు.

'అన్నదాత సుఖీభవ' కోసం 20లోగా నమోదు


ఏవో స్వప్న

కశింకోట: అన్నదాత సుఖీభవ పథకం కోసం ఆన్‌లైన్లో ఈ నెల 20వ తేదీలోగా రైతులు నమోదు చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి ఎం. స్వప్న తెలిపారు. ఇక్కడి మండల వ్యవసాయ శాఖ కార్యాలయంలో మంగళవారం ఆమె మాట్లాడుతూ ఈ పథకం కింద రైతుకు రూ.20 వేల వంతున పంటల సాగుకు ఆర్థిక సహాయం అందిస్తుందన్నారు. కౌలు రైతులకు ఈ పథకంలో సహాయం అందించాలని ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. కౌలు రైతులు సీసీఆర్‌సీ కార్డులు పొందాలన్నారు. అటవీ భూములపై హక్కులు ఉన్న వారికి ఈ పథకం వర్తిస్తుందన్నారు. రూ.పది వేలు పింఛన్ వచ్చే వారికి ఈ పథకం వర్తించదన్నారు. కుటుంబంలో ఒక్కరికి మాత్రమే సుఖీభవ పథకం వర్తిస్తుందన్నారు. ప్రభుత్వం అందించే ఆర్థిక సహాయాన్ని మూడు విడతలుగా చెల్లిస్తారన్నారు. దీనిలో పీఎం కిసాన్ కింద ఇస్తున్న రూ.6 వేలు ఇమిడి ఉంటాయన్నారు. వ్యవసాయ శాఖ సిబ్బంది రైతుల భూముల వివరాలు పరిశీలించి అర్హుల జాబితా రూపొందిస్తారన్నారు. ఈ పథకాన్ని ఈ నెలలోనే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రారంభించనున్నట్లు తెలిపారు.

దేవదాయ భూమి ఆక్రమణపై చర్యలకు డిమాండ్


మాట్లాడుతున్న రామ్మోహనరావు

అనకాపల్లి: జీవీఎంసీ విలీన గ్రామమైన సిరసపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయ ఆవరణలో 50 సెంట్లు భూమిని కొంతమంది వ్యక్తులు ఆక్రమించారని, దీనిపై ఉన్నత స్థాయి అధికారులు పూర్తిస్థాయిలో దర్యాప్తు చేసి, వారిపై చర్యలు తీసుకోవాలని ఆలయ ప్రతినిధి పొట్నూరు రామ్మోహనరావు కోరారు. వేంకటేశ్వరస్వామి ఆలయం వద్ద మంగళవారం ఆయన మాట్లాడుతూ వేంకటేశ్వరస్వామి, అలివేలు మంగమ్మ దేవాలయానికి డెవలప్‌మెంట్ ట్రస్ట్‌కు 1.09 ఎకరాల భూమిని అదే ప్రాంతానికి చెందిన మంత్రి నారాయణరావు, సన్యాసమ్మ దంపతులు 1986లో రాసి ఇచ్చారన్నారు. అప్పట్లోనే ఈ భూమిని దేవదాయ శాఖకు అప్పగించారన్నారు. రెండేళ్ల క్రితం దివంగత పడమటయ్య కుమారుడు మంత్రి బంగార్రాజు నకిలీ పత్రాలు సృష్టించి ఈ భూమిని అమ్మకాలు చేశారన్నారు. ఎకరా 09 సెంట్లు భూమికిగాను ప్రస్తుతం 0.73 సెంట్లు మాత్రమే మిగిలి ఉందన్నారు. మిగిలిన భూమిని కొంతమంది వ్యక్తులు ప్లాట్స్ వేసి అమ్మకాలు చేశారన్నారు. మాల మహానాడు జిల్లా ప్రధాన కార్యదర్శి గోడు వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ఆలయ భూమిని ఆక్రమించిన వ్యక్తులపై కలెక్టర్ తక్షణమే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు ఈగల మహేష్, కె.కృష్ణకుమార్, శేఖరమంత్రి నారాయణరావు తదితరులు పాల్గొన్నారు.

చిన భీమవరంలో డీ పట్టాలు రద్దు

బుచ్చెయ్యపేట : మండలంలో గల చిన భీమవరంలో ప్రభుత్వ పట్టా భూములను రెవిన్యూ అధికారులు రద్దు చేశారు. గ్రామానికి చెందిన కొంతమంది గాజువాకకు చెందిన పారిశ్రామికవేత్త కడియాల రాజేశ్వరరావుకు డీ పట్టా భూములను జిరాయితీ భూములుగా అమ్మకాలు చేసి మోసం చేశారు. రాజేశ్వరరావు వద్ద ఉన్న ప్రభుత్వ భూమిని మరలా తమకే అమ్మాలని ఇది డీ పట్టా భూములని కొంతమంది రాజేశ్వరరావుపై ఒత్తిడి చేశారు. దీంతో ప్రభుత్వ భూమి తిరిగి ప్రభుత్వానికే చెల్లాలని నెల రోజుల కిందట పారిశ్రామికవేత్త రాజేశ్వరరావు అనకాపల్లి జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్‌ను కలిసి తన వద్ద ఉన్న భూ రికార్డులను అప్పగించారు. దీంతో పీవోటీ యాక్ట్ ప్రకారం డీ పట్టాలు అమ్మిన రైతుల పేర్లపై ఉన్న డీ పట్టాలను రెవెన్యూ అధికారులు రద్దు చేశారు. సర్వే నెంబర్ 232-2లో చీపురుపల్లి మల్లమ్మకు చెందిన 5 ఎకరాలు, 224లో రొంగలి ఎర్రయ్యకు చెందిన 5 ఎకరాలు, 226-1లో రొంగలి సింహాచలంకు చెందిన 5 ఎకరాలు, 227-1లో చుందూరి క్రిష్ణమూర్తికి చెందిన 5.28 ఎకరాలు, 227-2లో సన్నాది సర్వేశ్వరరావుకు చెందిన 5.46 ఎకరాలు, 228లో చీపురుపల్లి నారాయణమ్మకు చెందిన 5 ఎకరాలు మొత్తం 30.74 ఎకరాలు డి పట్టాలను రద్దు చేస్తున్నట్టు రెవెన్యూ అధికార్లు ప్రకటించారు.

చెరువులను ఆక్రమిస్తే చర్యలు


చెరువును పరిశీలిస్తున్న జాయింట్ కలెక్టర్ జాహ్నవి

గొలుగొండ : చెరువులను ఆక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా జాయింట్ కలెక్టర్ జాహ్నవి పేర్కొన్నారు. గొలుగొండ మండలం, గుండిపాల, యల్లవరం గ్రామాల్లో ఉన్న చెరువులను మంగళవారం ఆమె పరిశీలించారు. చెరువుల విస్తీర్ణం గురించి ఆర్డీవో వి.వి.రమణను అడిగి తెలుసుకున్నారు. ఉపాధి పనులు చేస్తున్న కూలి డబ్బులు అందడం లేదని గ్రామస్తులు జాయింట్ కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లారు. పని చేసిన వారికి డబ్బులు చెల్లించాలని ఉపాధి హామీ అధికారులను ఆదేశించారు. ఆమె వెంట తహసీల్దార్, రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.